## నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*      - మల్లాది

**The difference between a right word and almost right word is the difference between lightning and lightning bug**

9

## శ్రీ సి. కనకాంబరరాజు - 2



**శ్రీమతి సి.ఆనందారామం,** శ్రీమతి శారదా అశోకవర్ధన్, చిట్టారెడ్డి సూర్యకుమారి, డాక్టర్ కె.వి.కృష్ణకుమారి, చక్కిలం విజయలక్ష్మి, రావినూతల సువర్నా కన్నన్, డాక్టర్ వాసా ప్రభావతి, నందుల సుశీలాదేవి మొదలైన లేడీ రైటర్స్, మైనంపాటి భాస్కర్, కొమ్మనాపల్లి గణపతిరావు, చల్లా సుబ్రహ్మణ్యం, మల్లిక్, జీడిగుంట రామచంద్రమూర్తి, యామినీ సరస్వతి, గంటి రమాదేవి (ఇది మగ రచయిత కలం పేరు) చావా శివకోటి, ద్విభాష్యం రాజేశ్వరరావు మొదలైన వారి నుంచి సీరియల్ వచ్చినా, చదివి, బావున్నవి ఫేవరిటిజం లేకుండా కనకాంబరరాజు భూమి వీక్లీలో ప్రచురించేవారు. పాఠకులని పెంచుకోడానికి విస్తృతమైన రచయితల వర్గం ఉండాలని ఆయన నమ్మేవారు.

పాఠకులు విరివిగా పాల్గొనే అనేక శీర్షికలు కూడా భూమి సర్క్యులేషన్‌కు ఉపయోగపడేవి. తమ ఫోటో, పేరు ఓ సారి భూమి వీక్లీలో ప్రచురింపబడితే, ఆ పాఠకుడు తమ పత్రికకు లాయల్‌గా ఉంటాడనే విశ్వాసంతో అలాంటి శీర్షికలు అనేకం సికరాజు ప్రవేశపెట్టారు. వీక్లీలలో గతంలో ఎవరూ ఇవేమీ చెయ్యకపోవడంతో పాఠకులు సికరాజు ఊహించినట్లుగానే భూమి వీక్లీని తమదిగా భావించసాగారు. అ.చె అనే పేరుతో 'అడగండి చెపుతా' అనే శీర్షికలో పాఠకుల ప్రశ్నలకి జవాబులు ఇచ్చే శీర్షికని కూడా సికరాజు నిర్వహించేవారు. అ.చె. 'మగ లేక ఆడ?' అని పాఠకులు తెలుసుకోవడానికి అడిగే ప్రశ్నలకి జవాబులు బోల్తా కొట్టించేలా ఇవ్వడం వల్ల ఆ శీర్షిక మీద పాఠకులకి ఆసక్తి ఉండేది. ఉదాహరణకి 'మీరు చీరకడతారా లేదా పేంట్ వేసుకుంటారా అనే ప్రశ్నకి 'లుంగీలో లంగా' అని జవాబు ఇచ్చేవారు. ఈ శీర్షికకి వచ్చిన పోస్ట్‌కార్డ్‌లు, ఆయన టేబుల్ మీద చాలా దొంతరలుండేవి. నేను అనేక కార్డులలోని ప్రశ్నలకి జవాబులు రాస్తే, వాటిని యధాతధంగా అ.చె.శీర్షికలో ప్రచురించారు. ఇలా ఎవరి సహకారం లభించినా కాదనేవారు కాదు. పని విషయంలో ఆయన అహంభావి కాకపోవడం ఆయన విజయానికి ఓ ప్రధాన కారణం.

ఆంధ్రభూమి వీక్లీకి నిత్యం వందల కొద్దీ పోస్ట్ కార్డులు, ఇన్‌లాండ్ లెటర్లు, కవర్లు పాఠకుల నుంచి అందేవి. దాదాపు నవలకి ఓ పాఠకుల పోటీని పెట్టేవారు. 'వెన్నెల్లో ఆడపిల్ల' నవలలో ఓ పోటీకి అనుకుంటా వచ్చిన పాఠకుల కార్డులని ఓ టేబుల్ మీద కుప్పగా పోసి వాటిలోంచి లక్కీ డిప్‌గా విజేతల కార్డులని తీసే కార్యక్రమాన్ని ఫోటో తీసి బాక్స్ ఐటమ్‌గా ప్రచురించారు. ఎన్ని వేల కార్డులు వచ్చాయో స్టాటిస్టిక్స్‌తో సహా. ఇందువల్ల సీరియల్ నవలకి, రచయితకి, పత్రికకి గల ఫాలోయింగ్ పత్రికా పాఠకులకి అర్ధమయ్యేది. సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్‌లోని పోస్టాఫీసు వారు ఆ కార్యాలయానికి వచ్చే కార్డుల మీద పై అధికారులకి ఫిర్యాదు కూడా చేశారు. ఉత్తరోత్తరా పోటీలో పాల్గొనే ధరలు పెంచడానికి నాంది ఇక్కడే పడింది. తర్వాత టీవీలోని పోటీలకి వచ్చే కార్డుల పరంపరవల్ల పోటీ కార్డుల ధరలని పోస్టల్ శాఖ బాగా పెంచేసింది.

కొందరు రచయితలు కొత్తగా సికరాజు గదిలోకి వచ్చినప్పుడు, తాము చూసిందాన్ని కొంత అపోహతో అర్ధం చేసుకునేవారు. ఆయన చుట్టూ ఉండే రచయితల సీరియల్స్ తప్ప, బయటివారివి వేయరని, ఆయనే నవలలకి థీమ్స్ చెపితే రచయితలు వాటిని రాస్తారని ఇలా ఏ వేవో ఊహించుకునేవారు. రచయితల, సంపాదకుల సర్కిల్స్‌లో ఇలాంటి వదంతులు అప్పట్లో చాలా విన్నాను. సత్తా ఉంటే, ఎవరు రాసినా సికరాజు ప్రచురించేవారు. ఆయనకి నవలకి కథని అల్లి, అందించే సామర్ధ్యం లేదు. కాని మనం చెప్పిన థీమ్ విని

లేదా ఓ వ్రాత ప్రతిని చదివి అది ఏ తరహా పాఠకులకి నచ్చుతుందో లేదా నచ్చదో అనేది కరెక్ట్‌గా జడ్జ్ చేయగలిగేవారు. అది సంపాదకుడుగా ఆయన విజయానికి మరో కారణం.

ఆంధ్రప్రభ, జ్యోతి, పత్రిక లాంటి వార పత్రికల సంపాదకుల దగ్గర రచయితలకి లేని చనువు, చొరవ సికరాజు దగ్గర ఉండేది. దాంతో రచయితలు ఓ నవలకి థీమ్‌నో, కొత్త శీర్షికని సికరాజుకి సూచించాలని గ్రహించేవారు కాదు. రాయబోయే నవల గురించి ఎవరైనా తనతో చర్చించేందుకు సికరాజు స్వంతంత్రాన్నిచ్చేవారు. వైజాగ్ లోని శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్య తరఫున ఒకరు వచ్చి ఆయన ఆధ్యాత్మిక నవల రాద్దామనుకుంటున్నారని, మధ్యవర్తిత్వం చేస్తే అది పాఠకులు చదవరు, ఒద్దని సికరాజు నిరాకరించడం నాకు తెలుసు.

వేదగిరి రాంబాబు, వేణు సికరాజు దగ్గర అసిస్టెంట్స్ ఎడిటర్స్‌గా పనిచేసేవారు ఓసారి భూమి మంత్లీ డిటెక్టివ్ కథల పోటీని నిర్వహించింది. దానికి నేను రాసిన కథకి ప్రథమ బహుమతి లభించింది. ఎందుకంటే, తెలుగులో డిటెక్టివ్ కథలు రాసేవాళ్ళే తక్కువ. పైగా అందులో ప్రకటన చూసి రాసేవాళ్ళు ఇంకా తక్కువ. ఆశ్చర్యంగా దాన్ని కంపోజ్ చేయాల్సి వచ్చినప్పుడు ఆ కథ వ్రాతప్రతి కార్యాలయంలోంచి మిస్సయింది. ఆ సంగతి సికరాజు నాతో చెప్పి, 'కాపీ ఉందా?' అని అడిగారు. నాకు ప్రతీ రచనకి కార్బన్ పెట్టి రాసే అలవాటుండేది. (ఇప్పుడైతే రాసిందాన్ని స్కాన్ చేసి, కాపీ ఉంచుకుంటున్నాను) కాపీ ఉందని చెప్పాక వేదగిరి రాంబాబుని నాతో పంపి, ఆ కాపీని ఇవ్వమని, కంపోజ్ చేయిస్తానని చెప్పారు. క్రాస్ రోడ్స్ సమీపంలో సంధ్య థియేటర్ వెనక సందులో ఓ గదిలో అప్పుడు అద్దెకుండేవాడిని. రాంబాబుకి అదిచ్చి పంపాను.

భూమి వీక్లీలో అచ్చు తప్పులు అధికంగా వచ్చేవి. వాడే పేపర్లో నాణ్యత ఉండేది కాదు. ఒక్కోవారం భూమి వీక్లీ వచ్చేదే కాదు. భూమి రాకపోతేనే యాజమాన్యానికి లాభం అని, కాస్టాఫ్ ప్రొడక్షన్ కంటే, అమ్మకాల మీద వచ్చేది తక్కువని సికరాజు చెప్పేవారు. సర్క్యులేషన్ పెరిగినప్పుడల్లా వెంటనే పెరిగిన కాపీలని ముద్రించేవారు కాదు. ఏజెంట్స్ నుంచి కాపీల కోసం ఫోన్ కాల్స్, టెలిగ్రామ్స్ వస్తూండేవి. (అయితే కాస్టాఫ్ ప్రొడక్షన్ అమ్మకాలకన్నా ఎక్కువ అన్నది నమ్మదగ్గదిగా లేదు)

"నేను మా పాఠకులకి ఎంతో రుణపడి ఉంటాను. టైంకి రాకపోయినా, అచ్చుతప్పులతో వచ్చినా వాళ్ళు ఎంతో సహనంతో కొని చదువుతూంటారు." అనేవాడాయన.

అప్పట్లో నేను పనిచేసే ఆఫీసు బేగంపేటలో అల్లావుద్దీన్ బిల్డింగ్ ఎదురుగా ఉండేది. పక్కనే ప్రకాష్ నగర్. వాసిరెడ్డి సీతాదేవి ఆ కాలనీలో ఉండేవారు. బ్రహ్మచారిణి అయిన ఆమె ఇంట్లో ఓ మళయాళీ మెయిడ్ ఉండేది. ఒకటి రెండుసార్లు ఆవిడ ఆహ్వానిస్తే, ఆమె ఇంటికి నా కొలీగ్‌తో వెళ్ళాను.

స్వతహాగా ఆమెలో అహం పాలు ఎక్కువ. సికరాజు ఆవిడతో సీరియల్ రాయించాలనుకున్నారు. కాని తను సీనియర్ రైటర్ కాబట్టి తన ఇంటికి వచ్చి ఆయన అడగాలని ఆమె కోరుకుంది. సికరాజుకి ఇది ఇష్టంలేదు. దాంతో సీతాదేవి సికరాజు మీద ద్వేషం పెంచుకుంది. భూమిలో వచ్చే వీరేంద్రనాథ్ నవల 'తులసిదళం' క్షుద్ర సాహిత్యం అని విమర్శించినవారిలో ఆవిడ కూడా ఉండటానికి కారణం ఇదే అని నా అభిప్రాయం.

నాతో ఆమె ఫ్రెండ్లీగా ఉన్నా, ఆంధ్రభూమి మనిషి అనే కోపం మనసులో ఉందని 'తేనెటీగ' జ్యోతి వీక్లీలో వచ్చే సమయంలో గమనించాను. 'తేనెటీగ' అనే పేరే అసభ్యంగా ఉంది కాబట్టి సినిమాకి ఆ పేరు మార్చాలని, అప్పట్లో సెన్సార్ బోర్డ్ సభ్యురాలైన ఆమె ప్రత్యేకంగా 'తేనెటీగ'కి తననే వేయించుకుని గొడవ చేసి, ఇబ్బంది పెట్టింది.

ఆవిడలాగే సీనియర్ రైటరైన శ్రీమతి సి. ఆనందారామాన్ని ఫోన్ చేసి సికరాజు అడిగితే ఆవిడ భూమిలో సీరియల్స్ రాసింది. సీతాదేవి, ఆనందారామం సమకాలీనులు కాబట్టి, ఇది తనని అవమానించినట్లుగా సీతాదేవి ఫీలయ్యేది. ఆవిడ వ్యక్తిగతంగా నన్ను ఇష్టపడేది,

రచయితగా ద్వేషించేది. ఇలాంటి ద్వంద్వ మనస్తత్వం నేను మరెవరిలోనూ చూడలేదు. ఆవిడకి వీరేంద్రనాథ్ అంటే, వ్యక్తిగతంగానూ రచయితగా కూడా బాగా ద్వేషం ఉండేది.

'వంటొచ్చిన మగాడు' అనే శీర్షికని వీరేంద్రనాథ్ సూచించారు. వంటలో ఆయనకి ప్రవేశం ఉంది కాబట్టి ఆయనతోనే ఆ శీర్షిక ఆరంభమై కొంతకాలం కొనసాగింది. మగాళ్ళే ఈ శీర్షికలో పాల్గొనాలి. ఇలాంటి తమాషా శీర్షికలతో పాఠకులలో పత్రిక పట్ల ఆసక్తి కొనసాగేలా జాగ్రత్త పడుతూండేవారు. అలాంటి వినూత్న ప్రయోగాల మయంగా వచ్చే భూమికి పాఠకుల ఆదరణ బాగా లభించింది. ఓ సీరియల్ నవల మీద పాఠకుల పోటీ నిర్వహించడం కూడా భూమితోనే మొదలు, సికరాజుతోనే అది అంతమైందని చెప్పాలి. నిజానికి భూమి వీక్లీ ఇంకా వస్తున్నా, ఆయన ప్రవేశపెట్టిన ఒరవడి తర్వాతి ఎడిటర్లు కొనసాగించలేదు. అవన్నీ రుజువైతే, సర్క్యులేషన్ పెంచే పద్ధతులని చరిత్ర నిరూపించినా ఏ వీక్లీ ఎడిటరూ వీటిని పరిశీలించి పాటించక పోవటం నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది. పైగా వాటిని చీప్ టెక్నిక్స్‌గా కొట్టిపారేస్తారు. ఆనాడు అంతా సికరాజుని ఈ నూతన వరవడి విషయంలో విమర్శించేవాళ్ళే. కొంతదాకా జ్యోతి వీక్లీ ఎడిటర్ పురాణం సుబ్రమణ్యశర్మ వాటిలోని కొంత భాగాన్ని అనుసరించారు. అయితే ఆయనకీ పరిమితులు విధించారు.

నేను గాంధీ నగర్‌లో అదే సమయంలో ఇల్లు కట్టుకున్నాను. మా ఇంటికి కిలోమీటరున్నర దూరంలో ఎస్.బి.ఐ కాలనీలోని ఓ ఇంట్లో సికరాజు అద్దెకుండేవారు. ఒకటి రెండుసార్లు నన్ను వారింటికి ఆహ్వానించారు. వారికి ఓ అమ్మాయి, అబ్బాయి ఉండేవారు. సికరాజు ఇంట్లో పమేరియన్ జాతికి చెందిన పెంపుడు కుక్క ఉండేది. తను ఎంత లేట్‌గా వెళ్ళినా అది తనకోసం ఎదురు చూస్తుందని, తను రాగానే ఆనందంగా అరుస్తుందని చెప్పారు.

చావా రామకోటి అనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ కూడా సికరాజు ద్వారానే నాకు పరిచయం. ఆయనకి సాహిత్యాభిలాష ఎక్కువ. ఓ రోజు సికరాజు ఇంటి ఎదురు ఏదో షాపు నడిపే చెయ్యిలేని ఒకతను రామకోటిని చూసి నమస్కరించాక రామకోటి చెప్పారు:

"వాడు దొంగ. అనేకసార్లు పట్టుబడ్డా దొంగతనాలు మానకపోవడంతో నేనే వాడి చేతిని విరగ్గొట్టాను."

అప్పట్లో ఆయన ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసేవారు. ఓ రోజు సికరాజు తన పన్నెండేళ్ళ కూతురుతో రామకోటిని కలవడానికి స్టేషన్‌కి వెళ్ళినప్పుడు చొరవగా లోపలికి వెళ్ళారు. ఆ సమయంలో ఆయన ఓ దొంగను సీలింగ్ నుంచి వేలాడదీసి కొట్టడం వాళ్ళమ్మాయి స్మితారాణి చూసి భయపడిందని సికరాజు చెప్పారు.. నేను కూడా ఓ సారి ఓ నేరస్తుడిని మోకాళ్ళ మధ్య కర్రని ఉంచి నిజం చెప్పించే ప్రయత్నం రామకోటి చేయడం చూసాను. అతను మూసీ నది బ్రిడ్జి కింద దొంగిలించిన సొత్తు దాచానని తర్వాత చెప్పాడని ఆయన నాతో చెప్పారు. రచయిత చావాశివకోటి, రామకోటిగారి సోదరుడు.

సాయంత్రాలు, నేను వీరేంద్రనాథ్, సోంబాబు ఆఫీసునుంచి సికరాజు దగ్గరకి వచ్చాక ఎప్పుడైనా డెక్కన్ క్రానికల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న బసేరా హోటల్‌కి వెళ్ళి టిఫిన్ తినేవాళ్ళం. వీరేంద్రనాథ్ మాత్రం హోటల్‌కి రావడానికి పెద్దగా ఇష్టపడేవాడు కాడు. ఏడున్నర తర్వాత ఏదైనా బార్‌కి వెళ్ళేవాళ్ళం. ఎక్కువ బ్రాడ్వే, రాష్ట్రపతి రోడ్డు అంతమై, పెరేడ్ గ్రౌండ్స్ రోడ్ ఆరంభమయ్యే కార్నర్‌లో మేడమీద ఉన్న లంగ్‌ఫంగ్‌కి, బసేరా హోటల్లోని బార్‌కి, సాధారణంగా వెళుతుండేవాళ్ళం. సోంబాబుకి డ్రింక్ మీద ఆసక్తి ఉండేది కాదు. వీరేంద్రనాథ్ ఒకటిన్నర పెగ్స్‌కి మించి ఎన్నడూ తీసుకునేవారు కాదు. సికరాజుకూడా తక్కువే తీసుకునేవారు. అందరిలోకీ దుర్మార్గుడ్ని నేనే. మూడు పెగ్గులు తక్కువ కాకుండా తీసుకునేవాడిని. వీరేంద్రనాథ్, 'లేద్దాం, ఇక వెళదాం' అంటే నాకు ఇంకా ఉండాల్సిన అవసరం ఉండేది. ఒక్కోసారి అతను వెళ్ళిపోయేవాడు. సికరాజు మాత్రం చివరిదాకా ఉండేవారు.

నాకు బాగా గుర్తు. లంగ్ ఫంగ్‌కి ఓ సారి జీడిగుంట రామచంద్రమూర్తి, నేను, సికరాజు మాత్రమే వెళ్ళాం. బిల్ వచ్చాక సికరాజు తన క్రెడిట్ కార్డు ఇస్తే, అది ఎక్స్‌పైర్ అయిపోయిందని వెనక్కిచ్చేసారు. రామచంద్రమూర్తి వెంటనే జేబులోంచి డబ్బుతీసారు కాని, ఆ బిల్లుని నేనే పేచేసాను. సికరాజు ఓసారి వీరేంద్రనాథ్‌ని, నన్ను, సోంబాబు, వేదకుమారి (ఈమె చిత్రకారిణి)లని తన కారులో కర్నూలు

తీసుకెళ్ళారు. చిట్టారెడ్డి సూర్యకుమారి భర్త చిట్టారెడ్డి లక్ష్మీపతి ఆహ్వానం మీద వెళ్ళాం. వారింట్లోనే బస. కర్నూలులో పాఠకులతో లిటరరీ మీటింగ్ జరిగింది. మర్నాడు నంద్యాలలో కూడా అలాంటి మీటింగే జరిగింది. మహానంది క్షేత్రం కూడా చూసాం.

సికరాజు ఆంధ్రభూమి వీక్లీ తరపున రెండుసార్లు రైటర్స్ మీటింగ్‌ని ఏర్పాటు చేసారు. మొదటిసారి ఆంధ్రభూమి కాంపౌండులో షామియానా వేసి రెండోసారి బషీర్‌బాగ్ లోని నాగార్జున హోటల్‌లో. ఆ హోటల్ ఆంధ్రభూమి వారిదే. రచయితల సలహాలు అభిప్రాయాలు ఆయన తీసుకున్నారు. ఎడిటర్ రచయితలు ఇలా కలవడం అదే మొదటిసారి. ఓ సారి ఆంధ్రభూమి కథల పోటీకి కథల ఎంపిక కోసం ప్రశాంతంగా కథలు చదవటానికి అనుకూలంగా ఉంటుందని లకడీకాపూల్ లోని కృష్ణా హోటల్‌లో ఓ గది తీసుకున్నారు. ఖర్చుకు వెరవకుండా సికరాజుకి భూమి యాజమాన్యం ఇలా సహకరించేది.

1986లో మొదటిసారి నేను లాండ్ లైన్ ఫోన్ తీసుకున్నాను. అప్పట్లో ఫోన్ రావడానికి ఆరేళ్ళు వెయిటింగ్ లిస్ట్ ఉండేది. OYT (ఓన్ యువర్ టెలిఫోన్) అనే స్కీంలో అయితే ఐదువేలు డిపాజిట్ కడితే, త్వరగా వచ్చేది నేనా స్కీంలో ఫోన్‌కి అప్లై చేసాను. అప్పట్లో మా ఇంటి పరిధిలోని ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లో పనిచేసే పరిచయం ఉన్న ఓ ఇంజనీర్ నంబర్ విషయంలో నాకు సహాయం చేసారు. తేలిగ్గా గుర్తుంచుకునే నంబర్ ఇవ్వమని కోరితే, ఉన్న వాటిలో కొత్తగా సరెండర్ అయిన 62244 నంబర్ నాకు అలాట్ చేసారు. ఫోన్‌కి కనెక్షన్ వచ్చిన మర్నాడు రచయిత్రి శారదా అశోకవర్ధన్ నుంచి, సికరాజుతో మాట్లాడాలని ఫోన్ వచ్చింది. తర్వాత సికరాజుని అడిగితే, అది తన పాత ఇంటి నంబరని చెప్పారు. ఆయన జూబ్లిహిల్స్‌లో కొత్త ఇల్లు కట్టుకుని షిఫ్ట్ అయినప్పుడు తన పాత ఫోన్‌ని ముషీరాబాద్ ఎక్స్చేంజ్‌లో సరెండర్ చేసారు. అనుకోకుండా అది నాకే అలాట్ అయింది. ఆ తర్వాత సికరాజు కోసం వచ్చిన చాలా ఫోన్‌కాల్స్ మేం రిసీవ్ చేసుకున్నాం.. నేనెన్నడూ ఆయన ఇంటికి ఫోన్ చేసేవాడిని కాదు. ఆయన ఇంటికి ఫోన్ చేసే రచయితలు, రచయిత్రులు ఎవరో అలా తెలిసారు.

సికరాజు దగ్గరకి తరచూ ఆయన స్కూల్‌మేట్ ఒకతను వచ్చేవారు పేరు గుర్తులేదు. ఆ క్లాస్‌మేట్ మిత్రుడు కంప్యూటర్ స్పెషలిస్ట్. సికరాజు నన్ను నా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో వెంట తీసుకురమ్మని ఆయన దగ్గరకి తీసుకెళ్ళారు. నా ఫోటో ఇస్తే, దాన్ని కంప్యూటర్‌లో ఫీడ్ చేసి, పెద్ద సైజ్ ఫోటోగా లోపల గ్రాఫిక్ చుక్కలతో తయారు చేసి, ఫ్రేమ్ కట్టి ఇచ్చాడు. దాన్ని మదనపల్లికి చెందిన సి.శ్రీకాంత్ కుమార్‌కి - పదేళ్ళ క్రితం ఇచ్చాను. ఇతను చిరంజీవి అభిమాన సంఘం నడిపేవారు. ఓ స్థానిక పత్రికకు ఎడిటర్.

క్రమేపీ సంపాదకుడుగా తన పొజిషన్‌ని డబ్బు సంపాదించేందుకు ఆయన వాడుకోవడం ఆరంభమైంది. సికరాజు ఓ అంబాసిడర్ కారుని కొని నడిపేవారు. దాన్ని తక్కువధరకి కొన్నానని చెప్పారు. ఆయన రచయితల నుంచి డబ్బు తీసుకునేవారు అని ఆయన మీద బాహాటంగా చాలా ఫిర్యాదులుండేవి. ఆయన సూటిగా నన్నెన్నడూ డబ్బు అడగలేదు. డబ్బు గొడవ వల్లనే వీరేంద్రనాథ్ భూమికి రాయడం విరమించుకున్నారని నాకు తెలిసింది. అయితే నేను వారిద్దరిలో ఎవరినీ దీనిగురించి అడుగలేదు. ఓసారి పారితోషికంగా పంపే మనియార్డర్ల విషయంలో ఏదో కుంభకోణం జరిగింది. దానికి సంబంధించిన క్లర్క్, సికరాజు చెప్పిన అడ్రస్‌లకే పంపానని, తనకేమీ తెలియదని చెప్పాడు. ఆ క్లర్క్‌ని ఉద్యోగంలోంచి తీసేసినట్లు గుర్తు. చావా రామకోటి ' నా పోలీస్ స్టేషన్‌కి ఆ క్లర్క్‌ని పంపిస్తే, గంటలో నిజం కనుక్కుంటాను ' అని నా ముందే సికరాజుతో చెప్పగా విన్నాను. ఇది నేను ప్రత్యక్షంగా తెలుసుకున్న సికరాజుకి సంబంధించిన ఓ అవినీతి పార్శ్వం. అంతకు ముందు ఓసారి నా చేత ఓ ఓచర్ మీద సంతకం చేయించుకున్నారు. 'దేనికని అడిగితే' ఎంటర్‌టైన్‌మెంట్ ఎక్స్‌పెన్సెస్ కోసం ' అని చెప్పారు. దాంట్లో ఎమౌంట్ కూడా లేకుండా బ్లాంక్‌గా ఉంది. మరెన్నడూ నేను ఓచర్ల మీద సంతకం చేయనని అందులో ఎంత మొత్తం ఉందో అది నా ఇన్ కంటాక్స్ రిటన్‌లో చూపకపోతే టాక్స్ ఎగ్గొట్టినట్లవుతుందని గట్టిగా చెప్పాను.

1984-85ల తర్వాత నేను భూమికి మళ్ళీ సీరియల్స్ రాయలేదు. అప్పట్లో జ్యోతి, పల్లకి, మయూరి, స్వాతి వీక్లీలలో సీరియల్స్ రాసేవాడిని. ఒకేసారి రెండుకి మించి వారపత్రికలకి సీరియల్స్ రాసేవాడిని కాదు. అందుకని సికరాజు నా సీరియల్స్ కావాలని గట్టిగా

కోరకపోవడంతో భూమికి రాయలేదు. కొమ్మనాపల్లి నేను సీరియల్ రాసే స్థానంలో రాసేవారు, రాయకపోయినా తరచూ సికరాజుని కలిసేవాడిని. ఆయన డబ్బు విషయంలో ఇలా చేసినా ఆయన మీద ద్వేష భావం కలగలేదు. కృతజ్ఞతా భావం పోలేదు.

'మల్లాదిని ఎలా హేండిల్ చేయాలో నాకు తెలియడంలేదు' అని ఓసారి నా ముందే ఎవరితోనో సికరాజు అనడం విన్నాను. బహుశా మల్లిక్‌తో అనుకుంటా.

సికరాజు చేతిలో డబ్బు విషయంలో మోసపోయినవారు కొందరు తమ అనుభవాలు నాకు చెప్పారు. బేంక్ ఆఫ్ బరోడాలో ఓ ఉద్యోగి సికరాజుకి కారులోన్ ఇప్పిస్తే దాన్ని కట్టకపోవడంతో, తన మిత్రుడైన గేరంటార్ కట్టాల్సి వచ్చిందని వాపోయారు. ఆయన ఎవరితోనైనా గేరంటార్ గా సంతకం చేయించి బేంక్ లోన్ తీసుకుని ఎగ్గొట్టడం చేసేవారని బాధితులు చెప్పేవారు.

ఎమెస్కోని స్థాపించిన శ్రీ ఎం.ఎన్ రావుగారబ్బాయి శేషాచల కుమార్. ఆ సంస్థకి నేను 'మందాకిని' అనే డైరెక్ట్ నవలని 1986లో రాసాను. తర్వాతి 'ఏడు వెడ్డింగ్ బెల్స్' అనే డైరెక్ట్ నవలని రాసాను. వెడ్డింగ్ బెల్స్‌ని ఆంధ్రభూమిద్వారా ప్రమోట్ చేస్తానని, కుమార్‌ని తనని కలవమని చెప్పమని 1987లో సికరాజు నాతో చెప్పారు. నేనా మాట కుమార్‌కి చెప్పి 'ఈ వ్యవహారం మీ ఇద్దరి మధ్యే తప్ప నా ప్రమేయం లేదు' అని స్పష్టంగా చెప్పాను. శేషాచల కుమార్, నేను, సికరాజుని కలిసాం. నవలలోని కొన్ని భాగాలు, కవర్ పేజీ, ప్రచురణ సంస్థ వివరాలు భూమి వీక్లీలో వేస్తానని సికరాజు మాట ఇచ్చారు. దాన్ని శేషాచల కుమార్ ప్రకటన ఖర్చుగా భావించారు. అందుకు పదివేల రూపాయలు తీసుకున్న సికరాజు, తన మాటని నిలబెట్టుకోలేదు. తన డబ్బుని వెనక్కివ్వమని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదని శేషాచల కుమార్ నాతో చెప్పారు. సికరాజుని ఆ విషయం నేనడిగితే 'ఇది మీకు సంబంధించింది కాదు. నాకు, కుమార్‌కి మధ్యగల లావాదేవి' అని చెప్పారు. 'నన్ను కూడా అందుకు మీరు ఉపయోగించుకున్నారు. నా ద్వారానే కదా అతనికి కబురు చేసింది? ఇలా అయితే మీకూ నాకూ రాం రాం' అని గట్టిగా చెప్పాను. అప్పటికి నా సీరియల్ 'ఈ గంట గడిస్తే చాలు' పూర్తయి కొత్త సీరియల్ రాయాల్సి ఉంది. నేను మళ్ళీ సికరాజు కార్యాలయానికి వెళ్ళలేదు. ఒకరిద్దరు ద్వారా ఆయన కబురు చేసినా వెళ్ళలేదు. నేను భూమికి రాయడం విరమించుకున్నాను. కుమార్‌కి కూడా నా మీద దురభిప్రాయం కలిగింది అనుకున్నాను. కానీ ఓ రోజు అతను మా ఇంటికి వచ్చారు. తను అమెరికాకి వెళ్ళిపోతున్నానని వీడ్కోలు చెప్పడానికి వచ్చాడు. సికరాజునుంచి తను ఆ పదివేలు, పోలీసుల సహాయంతో వసూలు చేసుకున్నానని కుమార్ ఆ సందర్భంలో చెప్పాడు.

సినీ నటి సరిత భర్త నించి విడాకులు తీసుకుంది. మద్రాస్‌లో భూమి సినీ జర్నలిస్ట్ కిషోర్ సహకారంతో ఆమె వైవాహిక జీవిత కథని భూమిలో సీరియల్‌గా వేశారు. సుమన్ అరెస్టు కేసు కూడా భూమిలో సికరాజు వేసిన గుర్తు. ఆంధ్రభూమి లీగల్ అడ్వైజర్ విజయ శాంతి హీరాయిన్‌గా ఓ సినిమా తీసారు. దానికి కథ సికరాజే. అయన పేరు శేషావతారం అని జ్ఞాపకం. ఆయన తర్వాత నాతో చెప్పారు, సికరాజుతో తనకి డబ్బుల దగ్గర గొడవ అయిందని. అమెరికా ప్రభుత్వం అప్పటి ప్రెసిడెంట్ ఎన్నికల సందర్భంగా అనుకుంటా సికరాజు గారిని తమ దేశానికి ఆహ్వానించారు. ఆ ట్రిప్ తర్వాత అమెరికా యా అమెరిక అనే ట్రావెలోగ్ సికరాజు భూమిలో రాసారు.

వీరేంద్రనాథ్, నేను భూమికి రాయడం మానేసాక, కొమ్మనాపల్లి, చల్లా సుబ్రమణ్యం, భూమి వీక్లీకి ప్రధాన సీరియల్ రచయితలయ్యారు. క్రమేపీ భూమి సర్క్యులేషన్ తగ్గసాగింది. కొంతకాలానికి సికరాజుకి, వీరేంద్రనాథ్‌కి మళ్ళీ సయోధ్య కుదిరింది. కాని మునుపటి సర్క్యులేషన్‌ని భూమి వీక్లీ మళ్ళీ పుంజుకోలేకపోయింది. దానికి ప్రధాన కారణం సికరాజు పాఠకులని ఆకట్టుకునే కొత్త శీర్షికలు, మార్గాలు చేపట్టడంలో విఫలమయ్యారు. పూర్వం పాఠకులు వినూత్నంగా భావించినదంతా పాతబడిపోయింది. మయూరి, పల్లకి, స్వాతి లాంటి కొత్త వీక్లీలు మార్కెట్లోకి రావడం వల్ల కూడా కొంత ఇబ్బంది ఏర్పడింది. ఆ తర్వాత నేను సికరాజుని ఒకే ఒక్కసారి 'అహ నా పెళ్ళంట' ప్రివ్యూలో దూరం నుంచి చూసాను. చావా రామకోటికి మా ఇద్దర్నీ ఎలాగైనా మళ్ళీ కలపాలని ఉండేది. భూమికి రాయమని, తను మాట్లాడతానని ఎన్నోసార్లు రామకోటి నన్ను అడిగారు. కాని నేనందుకు అంగీకరించలేదు. నా నవల

'కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్' సీరియల్ గా మయూరి వీక్లీలో వస్తున్నప్పుడు సికరాజు, నన్ను కోల్పోయినందుకు బాధపడ్డారని, 'మల్లాది మొండి. ఇక చేస్తే రాయరు' అన్నారని రామకోటి చెప్పారు. ఆ సాయంత్రం సికరాజు దగ్గరకి వెళదామన్నారు. కాని నేను నిరాకరించాను.



జూబ్లి హిల్స్‌లో ఆయన కట్టుకున్న ఇంటిని ఓసారి నన్ను పిలిచి చూపించారు. ఓ గది చూపించి, దాన్ని ఫారెస్ట్ వాతావరణంతో అలంకరించి ఆ గదిని డ్రింక్స్ తీసుకోడానికి ఉపయోగిస్తానని చెప్పారు. ఆయన జీతంతో అంత ఖరీదైన ఇల్లు కట్టడం సాధ్యం కాదు. ఇంటి గృహప్రవేశానికి వెళ్ళిన వీరేంద్రనాథ్, సికరాజుల మధ్య సయోధ్య కుదిరింది.

భూమికి రాస్తూంటే రచయితగా నాకు మంచి ప్రయోజనం ఉన్నా, మాట తప్పిన సికరాజు సంపాదకులుగా ఉండే పత్రికకి రాయడానికి మనస్కరించలేదు. రచయితగా ఎదుగుదలకన్నా నా ఆదర్శాన్నే నేను గట్టిగా పాటించాను. మరో ప్రముఖ వారపత్రిక విషయంలో కూడా ఇదే ఆదర్శాన్ని ఇంకా పాటిస్తున్నాను. ఆ మనిషిలోని స్వార్థం తీసి పక్కన పెడితే మిగిలినవన్నీ నా ఉద్దేశంలో మంచి గుణాలే. తను చేయగలిగిన సహాయం ఇతరులకి చేసేవారు.

చాలా మంది కొత్త రచయిత్రులు, తమ సీరియల్స్ 'ఆంధ్రభూమి' లో వేయించుకోవాలనే ఉద్దేశంతో, ఆయనతో క్లోజ్‌గా ఉండేవారని అందరూ అనుకుంటూ ఉండేవారు. ఇలాంటివి దాగవు కాబట్టి ఇవన్నీ ఆ రోజుల్లోనే ప్రచారంలోకి వచ్చాయి. వీటిమీద నన్నెంతో మంది ప్రశ్నించేవారు. అప్పటికీ, ఇప్పటికీ నా సమాధానం ఒక్కటే - నో కామెంట్!

భూమి వీక్లీలో త్రిగుణ్ అనే ఆర్టిస్టు పనిచేసేవాడు. మా సీరియల్స్‌కి అతనే బొమ్మలు గీసేవాడు. మా ఇంటి గృహప్రవేశానికి వచ్చి వడ్డనలో సహాయం కూడా చేసాడు. పాపం! ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. కారణం తెలీదు. సికరాజు శత్రువులు ఆయనే కారణం అన్నారు. కానీ నేను నమ్మలేదు. దంతూరి పండరీనాథ్ వాస్తు గురించి వస్తే సికరాజు సరేనని రాయించారు. తర్వాత వాస్తు ఎంత పాప్యులర్ అయిందో అందరికీ తెలుసు.

సికరాజుని ఆంధ్రభూమి నుంచి తీసేసారని ఎవరో చెప్పారు. యాజమాన్యం ఆయన ఆఫీస్ రూంకి తాళంవేసి ఆఫీస్‌లోకి రానీయలేదని, గేట్ దగ్గర సెక్యూరిటీ వాళ్ళే ఆయన్ని లోపలికి రానీయలేదని,చాలా అవమానకరంగా తీసేసారని తెలిసింది. నిజమెంతో తెలీదు కాని, ఆయన ఆఫీస్ గదిలో పోర్నోగ్రఫీ వీడియో టేప్స్ దొరికాయని కూడా రచయితలు చెప్పుకున్నారు.

ఓ వెలుగు వెలిగి ప్రాభవం కోల్పోయిన సికరాజుకి రచయితలు దూరమైనా రామకోటి కలుస్తూనే ఉన్నారు. సికరాజు ఆ తర్వాత సత్యం కంప్యూటర్స్ వారి ఓ పత్రికలో ఎడిటర్‌గా చేరారని కూడా విన్నాను. కాని ఆ పత్రికని నేనెన్నడూ చూడలేదు. అది పాపులర్ కాలేదు. ఓ ఉదయం చావా రామకోటి ఫోన్ చేసి సికరాజు పోయారని, తను చూడడానికి వెళుతున్నానని దారిలో పికప్ చేస్తానని

చెప్పారు. నేను రానని చెప్పాను. నాకు పూర్వం పరిచయం ఉన్న సికరాజే గుర్తుండిపోవాలనుకుని ఆయన మృతదేహాన్ని చూడడానికి నేను ఇష్టపడలేదు.

ఓ మేకు తక్కువై నాడా పోయింది.

ఓ నాడా తక్కువై ఓ గుర్రం పోయింది.

ఓ గుర్రం తక్కువై ఓ సైనికుడు పోయాడు.

ఓ సైనికుడు తక్కువై యుద్ధంలో ఓడారు.

సికరాజులాంటి సమర్థులైన సంపాదకులు లేక నేటి చాలా పత్రికల పరిస్థితి ఇలా ఉంది.

Click here to share your comments on this story